

# మెత్తని చెప్పు

వట్లమన్నాటి కుటుంబరావు

ఇంజనీరు మహాపేనరావుకి వాహనమయితే దొడ్డదేగానీ... మనసు మాత్రం మహాచెడ్డది. ఆఫీసు పని ముగించుకుని అతను రాత్రిపూట ఏడున్నర ఎనిమిది గంటలకు ఇంటికి తిరిగి వస్తాంటాడు బుల్లెట్ మీద. ఆ వచ్చేవాడు తిన్నగా వచ్చేస్తే ఎవరికీ ఏ బాధా ఉండకపోను. ఆ సమయంలో... మహాపేనరావు ఇంటికి వెళ్ళే సందులో... అటుపక్క ఇటుపక్క యిళ్ళ తాలూకు ఇల్లాళ్ళు, చెల్లెళ్ళు, వదినలు, వగైరాలు ఇంటిపని, వంటపని ముగించుకుని... తమ తాలూకు మగవాళ్ళ ఇళ్ళకు చేరే లోపల... మెట్లమీద కూర్చుని ముచ్చట్లాడుకుంటూ... కబుర్లు చెప్పుకుంటుంటారు. ఆ దృశ్యం చూసిన మహాపేనరావుకు... అహం పొంగుతుందో... లేక వ్యామోహం చిందుతుందోగానీ... బుల్లెట్ హెడ్ లైట్ కాంతి మాత్రం-క్రమం తప్పకుండా ఆ కాంతామణుల మీద పడుతుంది. మామూలుగా అయితే ఆ మహిళామణులుకూడా పెద్దగా పట్టించు

కోకపోదురు! ఒకసారి తమ శిరోజాల మీద మరోసారి తమ ఉరోజాలమీద, ఇంకోసారి తమ కనుముక్కులమీద పదేపదే పడటంతో వాళ్ళకి అనుమాన మేసింది. మహాసేనరావు- బుల్లెట్ హేండిల్‌మీద తన హస్తలాఘవం ప్రదర్శించి...బుల్లెట్ హెడ్‌లైటుకాంతి చేత చెడుగుడు ఆడిస్తున్నాడని, తమ అనుమానం ధృవపరచుకున్న తరవాత ఆ తరుణీమణులందరికీ... సీరియస్‌గా, సీరియల్‌గా అవమానం కలిగింది.

ఆపి... అదిలించి... బెదిరించి చెప్పటానికి చిన్న చితక పిల్లాడు కాదాయె! నూట అరవైఅయిదు కే.జీ.లు బరువుగల మోటారు వాహనంమీద స్టయిలుగా సవారీచేస్తున్న నూట యాభై పౌన్ల భారీవిగ్రహమాయె! మగవాళ్ళతో చెపితే... ఆ ఇంజనీరుని పచ్చడిపచ్చడి చేసి నంజుకు తింటారో. ఏమో? లేని పోని గొడవ నెత్తిమీదకు తెచ్చుకున్న ట్టవుతుంది. అందుకని తమ ఆగ్రహాన్ని బలవంతంగా నిగ్రహించుకున్నారా వీరజాణలు! మహాసేనరావు మనసులోని మాలిన్యపు నలుసు మాయమవక పోతుందా అనుకుని. అబ్బే! ఏం లాభం లేదు. రోజురోజుకీ బుల్లెట్ లైటు కాంతి ఆ ఇంతుల అంగాంగాలమీద పడి వారికి మనశ్శాంతిలేకుండా చెయ్యసాగింది.

అతివలందరూ అనసూయమ్మ గారింట్లో సమావేశమయ్యారు. ఈ క్లేశ పాశంనుంచి ఎలా తప్పించుకోవాలో... ఈ సిగ్గుమాలిన శిక్షనుంచి ఎలా బయట పడాలో... మహాసేనరావు నెలా మట్టి కరిపించాలో సుదీర్ఘంగా చర్చించారు.

ఒకవారం రోజులు గడిచిపోయాయి. మహాసేనరావు మట్టికరవనూలేదు. తను చేపట్టిన నారీజన చిత్రహింసా కార్యక్రమం విడిచిపెట్టనూ లేదు... హెడ్ లైటుకాంతితో. దాంతో— దీనురాళ్ళైన ఇంతువదనలందరూ ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారేమో అనిపించింది.

ఆరోజు రాత్రి ఏడున్నర గంటలకు మహాసేనరావు బుల్లెట్— మహోత్సాహంతో ముందుకు దూసుకు వస్తోంది. దానికి కారణం— సందు మొదలునుంచీ మెట్లమీద కూర్చుని— కబుర్లాడు కుంటున్న రంగురంగు చీరలే! మహాసేనరావు ఇల్లు ఓ వంద గజాలుందన గానే— ఎవరో కొంటెకుర్రాళ్ళు... చటుక్కున రాళ్ళు విసరటం— అతని బుల్లెట్ హెడ్‌లైట్ ఠప్‌మని పగిలి ఆరిపోవటం... ఆ కుర్రాళ్ళు ఇళ్ళల్లోకి పారిపోవటం...మహాసేనరావు వాహనానికి బ్రేకుపడి ఆగిపోవటం ఒకదానివెంట ఒకటిగా జరిగిపోయాయి.

ఎనుబోతు మీద నుంచి దిగి—యమ ధర్మరాజులా నడిచి వస్తున్న... మహాసేనరావు అగ్గిమీద గుగ్గిలమే అయ్యాడు. "రేయ్! ఎవర్రా ఆ రాళ్ళు విసిరింది? మర్యాదగా బయటికి రండి. లేకపోతే—

ఇంట్లోకి జొరబడి లాక్కొచ్చి మక్కెలు విరగ గొడతాము" అంటూ చిందులు తొక్కాడు.

"రండన్నయ్యగారూ! ఆ కుర్రాళ్ళంతా మా ఇంట్లో దాక్కున్నారు. వచ్చి వాళ్ళ భరతం పట్టండి" అంది అనసూయమ్మ.

"తనంటే ఆడవాళ్ళకు కూడా హడలన్నమాట" అనుకొన్న మహాసేవ రావు భీమసేనుడిలా ఆమె ఇంట్లో అడుగు పెట్టాడు. కుర్చీ చూపించింది అనసూయమ్మ. కూర్చోవటంతోనే ఆశ్చర్య పోయాడు. కంగుతినిపోయాడు.

దాదాపు ఆరేడుగురు కుర్రాళ్ళు... అంతా పది పన్నెండేళ్ళలోపు వయసు గల వాళ్ళు... కాఫీ కప్పులతో ప్రత్యక్ష మయ్యారు.

గంభీరంగా అంది అనసూయమ్మ.

"ఒరేయ్! కుర్రగాడిదలూ! ఇవ్వండిరా- ఇంజనీరుగారికి మర్యాద చెయ్యండి. కాఫీ ఇచ్చి... ఆ తరవాత ఆయన కాళ్ళకు మొక్కండి. ఎందుకో తెలుసా? ఆయన మీ అమ్మల మీద... అక్కల మీద... పిన్నిలమీద వదినెల మీద... ఎంతో ప్రేమతో... మోటారు సైకిలు లైటు కాంతి వేస్తుంటాడుగా...? అందుకు. ఆడవాళ్ళని ఏడిపించటంలో అగ్రగణ్యుడురా ఆయన! అందుకే...ఆ మహాత్ముడికి కాఫీ ఇవ్వండిరా! కాళ్ళు పట్టండరా!"

మెత్తని చెప్పుతో వాయగొట్టబడిన మహాసేవరావు ముఖం కందిపోయిందో- మూరెలా ఉబ్బిపోయిందో తెలియదు గానీ...మర్నాటి రాత్రి నుంచి... ఏ ఆడదాని ముఖంమీద శరీరం మీద... బుల్లెట్ హెడ్‌లైట్ కాంతి కావాలని పడలేదు.

